
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 15 । జూన్ । 2024



కనకమ్మకు క్షీరాభిషేకం

విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. 8లో



శ్రావ్యంగా కచేరీ

విశాఖ మ్యూజిక్ అకాడమి యువజన వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వయోలిన్ కచేరీ శ్రావ్యంగా సాగింది. 8లో



ఘనంగా వారంతపు పూజలు

రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారాంతపు పూజలు ఘనంగా జరిగాయి. 8లో

జగన్‌ను కలిసిన అరకు ఎంపీ దంపతులు



అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి, చెట్టి వినయ్ దంపతులు కుమార్తెతో కలిసి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.
- సాక్షి,పాడేరు

న్యూస్‌రీల్

ఏపీ జెన్‌కో లోయర్ సీలేరు సీఈగా జవహర్



- బాధ్యతల స్వీకరణ

మోతుగూడెం: ఏపీ జెన్‌కో లోయర్ సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా జవహర్‌ను నియమిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బి. శ్రీధర్ విజయవాడ ఏపీ జెన్‌కో శిక్షణ కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతన చీఫ్ ఇంజనీర్ జవహర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ఏపీ జెన్‌కో అధికారులు అభినందనలు తెలిపారు. బదిలీయైన చీఫ్ ఇంజనీర్ శ్రీధర్‌ను స్థానిక జెన్‌కో అధికారులు, కార్మిక సంఘ ప్రతినిధులు, సభ్యులు ఘనంగా సత్కరించారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

- ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: అత్యవసర సమయంలో రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసే అవకాశముందని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు క్షతగాత్రులకు రక్తం ఎంతో అవసరముంటుందని, రక్తహీనతతో బాధపడే వారికి సైతం రక్తం ఎంతో అవసరమని చెప్పారు. మనం దానం చేసే రక్తం ఎంతోమంది జీవితాలు కాపాడుతుందని, యువతతో పాటు ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ఏరియా ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో రక్తనిల్వలు అవసరమైన మేరకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన సూచించారు. శిబిరంలో 20 మంది రక్తదానం చేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు. వైద్యులు కౌశిక్, సాయికిషోర్, జ్యోత్స్నప్రియ, హర్ష, ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారుజాతి కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అటవీ సిబ్బంది

కొయ్యూరు: చింతలపూడి పంచాయతీ గింజర్తి సమీపంలో శుక్రవారం అటవీ రేంజర్ శివరంజని ఆధ్వర్యంలో 26 మారుజాతి కలప ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ముందస్తు మేరకు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నామని రేంజర్ తెలిపారు.

కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పాడేరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 18 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ హిస్టరీ, బీఏ పొలిటికల్ సైన్స్ ఆనర్స్, బీఏ స్పెషల్ ఇంగ్లిష్, స్పెషల్ తెలుగు ఆనర్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, సైన్స్ విభాగంలో బీఎస్సీ ఫిజికల్ సైన్స్ ఆనర్స్, బీఎస్సీ కెమిస్ట్రీ ఆనర్స్, బీఎస్సీ బోటనీ ఆనర్స్, బీఎస్సీ జువాలజీ ఆనర్స్ తదితర గ్రూపులన్నీ అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో అడ్మిషన్ల కో–ఆర్డినేటర్ టి.ఎన్.రసూల్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఏజెన్సీలో లిచీ సాగు చేపట్టిన రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. ఈ ప్రాంత వాతావరణం సాగుకు అనుకూలమని గుర్తించిన చింతపల్లిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు. విజయవంతమవడంతో 2016లో రైతులకు సాగును పరిచయం చేశారు. తోటలు ఏపుగా పెరగడంతో గిరిజన రైతులు నిలకడగా మంచి ఆదాయం పొందుతున్నారు.

లాభాల లిచీ..



చింతపల్లిలోని వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానంలో విరగ్గాసిన లిచీ చెట్టు



సిగినపల్లిలో మామిడితోటలో లిచీ చెట్లు

- సాగుకు అనుకూలించిన ఏజెన్సీ వాతావరణం
- గుర్తించిన చింతపల్లి ఉద్యానవనం పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు
- మంచి ఆదాయం పొందుతున్న రైతులు
- స్థానికంగా కిలో రూ.100 నుంచి రూ.120కు కొనుగోలు
- పెరగనున్న విస్తీర్ణం

చింతపల్లి రూరల్: ఉత్తర భారతదేశానికి మాత్రమే పరిమితమైన లిచీ పండ్ల రుచులు ఇప్పుడు జిల్లాలోని గూడెంకొత్తవీధి మండలం సిగినపల్లిలో కనిపిస్తున్నాయి. ఇప్పటికే డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, స్ట్రాబెర్రీని గిరిజనులు పండిస్తున్నారు. ఈ కోవలో ఇప్పుడు లిచీ కూడా చేరింది. మంచి ఆదాయం వస్తుండటంతో గిరిరైతులు సాగుపట్ల ఆసక్తి చూపుతున్నారు.

మెండుగా రుచి,పోషకాలు

రుచితోపాటు ఆరోగ్య పోషకాలు అందించే పండ్లలో లిచీ ఒకటి. బిహార్, వెస్ట్ బెంగాల్‌లో అధిక విస్తీర్ణంలో కనిపించే ఈ పండ్లతోటల విస్తీర్ణం ఇక జిల్లాలో పెరగనుంది. ఏజెన్సీలో తేమ, ఎండ, చలి వాతావరణం ఈ సాగుకు అనుకూలం. చింతపల్లిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా చేపట్టిన సాగు మంచి దిగుబడి ఇవ్వడంతో 2016లో రైతులకు పరిచయం చేశారు. అప్పటిలో కాఫీ మొక్కలతోపాటు ఒకొక్క రైతుకు 30 లిచీ మొక్కలను మాతోట సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బిహార్ రాష్ట్రంలోని ముజాహోర్‌పూర్‌లోని నేషనల్ రిసార్చ్ సెంటర్ నుంచి షాహీ, బేడా, చైనా రకాల మొక్కలను తీసుకువచ్చి నాటారు. ఈ రకాలు మన్యం వాతావరణంలో మంచి దిగుబడి ఇస్తున్నాయని ఉద్యానవన పరిశోధనస్థానం శాస్త్రవేత్త శివకుమార్ తెలిపారు.

మిశ్రమ సాగుగా..

గూడెంకొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ సిగినపల్లిలో 2016లో సుమారు 40 మంది గిరిజన రైతులు లిచీ మొక్కలను మామిడిలో మిశ్రమ పంటగా నాటారు. ఎకరాకు 60 మొక్కలు అవసరం కాగా వీటిలో 30 మామిడి, మిగతా 30 లిచీ మొక్కలను నాటారు. సాగుపట్ల సరియైన అవగాహన లేకపోవడంతో ఎకరా తోటలో 10 మాత్రమే మిగిలాయి. ఇవి మంచి ఆదాయం ఇస్తున్నాయని రైతులు తెలిపారు. మామిడితో పోలిస్తే లిచీపైనే మంచి ఆదాయం వస్తోందని వారు వివరించారు. 2016లో నాటగా ఐదేళ్ల తరువాత నుంచి పండ్ల దిగుబడి మొదలైందని, సారవంతాన్ని బట్టి ఎకరాకు 50 నుంచి వంద కిలోల వరకు దిగుబడి వస్తోందని రైతులు పేర్కొన్నారు. చెట్టు ఎదిగే కొద్దీ ఏటా దిగుబడి పెరుగుతోందని వారు వివరించారు.

స్థానికంగా మార్కెటింగ్: లిచీ పండ్లకు మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. పట్టణ ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉన్నందున చింతపల్లి ప్రాంతానికి చెందిన వర్తకులు కిలో రూ.100 నుంచి 120కు కొనుగోలు చేస్తున్నారని గిరి రైతులు తెలిపారు. వీటిని చింతపల్లిలో కిలో రూ.150కు విక్రయిస్తున్నారు. నర్సీపట్నం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో కిలో రూ.200 వరకు ధర ఉంది. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు కాపు ఉంటుంది. అవసరమైన పోషకాలన్నీ పండ్లలో ఉన్నా యి. గుండె, కాలేయం , మెదడు సంబంధిత వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్, ఊబకాయంతో బాధపడే వారికి ఆరోగ్యపరంగా ఎంతగానో ఉపయోగపడుతుంది.

మామిడి కన్నా మేలు



ఈ ప్రాంతానికి కొత్త పంట కావడంతో ఎకరాలో మామిడితోపాటు 30 లిచీ మొక్కలను నాటాం. అయితే వీటి పెంపకం పట్ల సరియైన అవగాహన లేకపోవడంతో 10 మొక్కలు మాత్రమే మిగిలాయి. మామిడి కన్నా ఆదాయం బాగుంది. ప్రస్తుత సీజన్‌లో వంద కిలోల వరకు విక్రయించగా రూ.10 వేలు వచ్చింది. సాగుపట్ల శాస్త్రవేత్తలు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే మంచి ఆదాయం వస్తుంది.
– సాగిన లక్ష్మణరావు, లిచీ రైతు, సిగినపల్లి, గూడెంకొత్తవీధి మండలం

మంచి ఆదాయ వనరు



రానున్న రోజుల్లో లిచీ సాగు గిరిజన రైతులకు ఆదాయ వనరుగా మారనుంది. ఇప్పటికే గూడెంకొత్తవీధి మండలంలో సిగినపల్లి, మాడేం గ్రామాల్లో గిరిజన రైతులు పండిస్తున్నారు. విదేశీ పంటల సాగుకు మన్యం వాతావరణం ఎంతో అనుకూలం. అవకాడో, స్ట్రాబెర్రీ, డ్రాగన్ ఫ్రూట్ మాదిరిగానే ఏజెన్సీ ప్రాంతంలో పండటం గిరిజన రైతుల అదృష్టం. రైతులంతా ఈ సాగు చేపడితే మంచి ఆదాయం పొందవచ్చు.
– డాక్టర్ శివకుమార్, శాస్త్రవేత్త, ఉద్యానవన పరిశోధన స్థానం, చింతపల్లి

పెదవలస రేంజర్‌గా శివరంజని



కొయ్యూరు: మండలంలోని అటవీశాఖ పెదవలస రేంజర్‌గా శుక్రవారం యు.శివరంజని బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్ల క్రితం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూపు–1లో ప్రతిభ కనబరిచిన ఆమె అటవీ రేంజర్‌గా ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని చంద్రపట్ అటవీ శిక్షణ కార్యాలయంలో 18 నెలల పాటు శిక్షణ పొందిన ఆమె ట్రైనీగా పార్వతీపురంలో మూడు నెలలు పని చేశారు. అనంతరం పెదవలస రేంజర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆమె కాకరపాడు కలప డిపోను సందర్శించారు. పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అటవీ పరిరక్షణకు చర్యలు తీసుకోవడమే కాకుండా విలువైన వనాలు తరలిపోకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

కలలు నిజం చేసుకుని.. ఉన్నతస్థాయికి..

అందరు కలలు కంటారు.అయితే కొందరు మాత్రమే వాటిని నిజం చేసుకుంటారు..వారిలో పెదవలస రేంజర్‌గా నియమితులైన శివరంజని ఒకరు. విజయనగరం జిల్లా శృంగవరపుకోటకు చెందిన ఆమె భారతీయ అటవీ సర్వీస్(ఐఎఫ్ఎస్) సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఆమె తండ్రి ప్రసాదరావు అనంతగిరి మండలం ములియగుడలో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. చిన్నప్పట్నుంచి చదువులో ముందుండే ఆమె హైదరాబాద్‌లో 21సెంచరీ ఐఏఎస్ అకాడమీలో కోచింగ్ తీసుకుని కొలువు సాధించారు. ఒకవైపు రేంజర్‌గా విధులు నిర్వహిస్తూ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నట్టు ఆమె తెలిపారు. తాను 18 నెలల శిక్షణ కాలంలో అడవుల వల్ల కలిగే ప్రయోజనాలతో సహా అనేక విషయాలపై అవగాహన పెంచుకున్నామన్నారు. చిన్నప్పటినుంచి లక్ష్యంతో చదివితే ఉన్నతస్థానాన్ని తప్పనిసరిగా సాధిస్తామని ఆమె పేర్కొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యతో మెరుగైన విజ్ఞానం



పూర్వ ప్రాథమిక విద్య పూర్తిచేసుకున్న పిల్లలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పీడీ సూర్యలక్ష్మి



ఎం.మాకవరంలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

చింతపల్లి రూరల్: పూర్వ ప్రాథమిక విద్య పిల్లల్లో విజ్ఞానం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి అన్నారు. స్థానిక ముత్యాలమ్మతల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఐదేళ్లు నిండి అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న పిల్లలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యను అభ్యసించిన పిల్లలు మున్ముందు చదవబోయే తరగతుల్లో మరింత చురుగ్గా పాల్గొంటారన్నారు. ఈ విద్య వల్ల పిల్లలు మానసికంగా, శారీరకంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు. మండలంలో 596 మంది చిన్నారులు ఐదేళ్లు నిండి అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యను పూర్తిచేసుకున్నారన్నారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అధికారులు, కార్యకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో రమణి, ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గౌహర్ ఉన్నీషా, సత్యవతి, గౌరి, అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్లతో ఎంతో ఉపయోగం

కొయ్యూరు: కిచెన్ గార్డెన్‌లో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయల సాగుతో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించవచ్చని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి అన్నారు. శుక్రవారం కొయ్యూరు ప్రాజెక్ట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసీఈ పూర్తి చేసుకున్న ఐదు సంవత్సరాల విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో చేరేందుకు వీలుగా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఆకుకూరల వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. అనంతరరం ఎం.మాకవరంలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు.మిగిలిన మండలాల కన్నా ఇక్కడి కిచెన్ గార్డెన్లు బాగున్నాయని ఆమె సీడీపీవో విజయకుమారి, వర్కర్లను అభినందించారు. జిల్లాలో మోడల్ ప్రాజెక్ట్‌గా ఇది కనిపిస్తుందని చెప్పారు. అన్నిచోట్ల తప్పనిసరిగా కిచెన్ గార్డెన్లను వేయిస్తామని ఆమె తెలిపారు.

విద్యార్థులంతా హాజరయ్యేలా చర్యలు

హెచ్‌ఎంలకు పీవో అభిషేక్ ఆదేశం



చింతపల్లిలో విద్యార్థులు, అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



తాజంగిలో నిర్మిస్తున్న మ్యూజియాన్ని పరిశీలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



ప్రత్యామ్నాయ రహదారి పనులపై సూచనలిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య

చింతపల్లి రూరల్: విద్యార్థులు నూరు శాతం పాఠశాలలకు హాజరయ్యేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికలు, బాలురు ఆశ్రమ పాఠశాలలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21లోగా ప్రతీ విద్యార్థి పాఠశాలలో చేరేలా తహసీల్దార్, ఎంపీడీవో, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై సంబంధిత సచివాలయ పరిధిలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలోని 117 ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి ఒకొక్క పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున టెన్త్ విద్యార్థులను ఎంపిక చేసి వారికి సూపర్ 50 కింద ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. విద్యార్థులు బాగా చదివి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠశాలలకు హాజరు కాని యెడల సంబంధిత హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ఆంగ్ల భాష మీద పట్టు పెంచేలా సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపించాలని కోరారు. అనంతరం తాజంగిలో నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమర యోధుల మ్యూజియం, లంబసింగి పీహెచ్‌సీలో నిర్మిస్తున్న బ్లాక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజనసంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు, ఉపసంచాలకులు కొండలరావు, డీఈ చాణక్యరావు, ఏఈ యాదకిశోర్, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, ఎంఈవో పనసల ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ప్రవేశాలు: చింతూరు పీవో కావూరి చైతన్య ఆదేశం

చింతూరు: ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులంతా సకాలంలో హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక నర్సింహపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నాలుగు మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతి ఆశ్రమ పాఠశాలలో నిబంధనల ప్రకారం ప్రవేశాలు చేపట్టాలని, బడిబయట ఉన్న పిల్లలకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలతోపాటు ఇతర సామగ్రి విధిగా అందజేయాలని, పాఠశాలలు, హాస్టళ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. మలేరియా నిర్మూలనకు యాంటీలార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయాలని, పాఠశాలల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. మెనూ ప్రకారం వేడి ఆహారం అందించాలని, నిబంధనలు పాటించని సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హెచచరించారు. వరదల సమయంలో ఉపయోగపడేందుకు నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ రహదారులను పీవో పరిశీలించారు. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి నుంచి కోతులగుట్ట వరకు నిర్మిస్తున్న రహదారిని పరిశీలించారు. వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

జిల్లాలో ఉరుములు.. మెరుపులు.. పెనుగాలులతో కూడిన వర్షానికి భారీ వృక్షాలు నేలకూలాయి. పిడుగుపాటుకు ఒకరు మృతి చెందగా, మరొకరు అస్వస్థతకు గురయ్యారు. విద్యుత్ లైన్లపై చెట్లు కూలడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు అడ్డంగా చెట్లు పడటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది.

- పిడుగుపాటుకు ఒకరి మృతి, మరొకరికి అస్వస్థత
- పెనుగాలులకు కూలిన భారీ వృక్షాలు
- రోడ్లకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం
- దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు
- నిలిచిన సరఫరా



పిడుగుపాటుకు మృతి చెందిన నాగబాబు



లాగరాయి- లబ్బర్తి మధ్య కూలిన చెట్టును తొలగిస్తున్న గ్రామస్తులు



గరుడాపల్లి ప్రాంతంలో భారీ వర్షానికి పొలాల్లో చేరిన వరదనీరు



ఎటపాకలో ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్టు



కింద్ర గ్రామంలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడిన విద్యుత్ స్తంభం



విద్యుత్ వైర్లపై విరిగి పడిన చెట్లు

రాజవొమ్మంగి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. పెనుగాలులకు లబ్బర్తి– లాగరాయి గ్రామాల మధ్య రెండు చోట్ల చెట్లు నేలకొరిగాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. స్థానికులు చెట్ల తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు. విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కమ్యూనికేషన్ వ్యవస్థ నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

పిడుగుపాటుకు నిండుప్రాణం బలి..

మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన కొల్లి నాగబాబు (30) మొల్లిమెట్ల సమీపాన పిడుగుపాటుకు గురై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అక్కడే ఉన్న అతని మేనల్లుడు పెంటకోట దేవకిరణ్ (23) అపస్మారక స్థితికి చేరుకున్నాడు. లాగరాయి పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యాధికారి ఉషశ్రీ తెలిపారు. నాగబాబు అనారోగ్యానికి గురైన కుమార్తె, భార్యతో కలిసి ఏలేశ్వరంలోని ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ చికిత్స అనంతరం వారు స్వగ్రామం బయలుదేరారు. భార్య, కుమార్తెను ఏలేశ్వరంలో బస్సు ఎక్కించిన నాగబాబు మేనల్లుడు దేవకిరణ్‌తో కలిసి బైక్‌పై స్వగ్రామం వస్తున్నాడు. మండలంలోని మొల్లిమెట్ల గ్రామ సమీపానికి వచ్చే సరికి వర్షం రావడంతో వారిద్దరు రోడ్డు పక్కన గల చెట్టుకింద నిలబడి ఉన్నారు. అదే సమయంలో పిడుగు పడటంతో నాగబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. దేవకిరణ్ అపస్మారక స్థితికి చేరుకోవడంతో వెంటనే స్థానికులు అతనిని లాగరాయి పీహెచ్‌సీకు తరలించారు. నాగబాబు మృతితో లాగరాయిలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇలావుండగా పిడుగుపాటుకు మొల్లిమెట్ల గ్రామ సమీపంలో దుక్కిటెద్దు మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. కింద్రగ్రామంలో పెనుగాలులకు ట్రాన్స్‌ఫార్మర్‌తో కూడిన విద్యుత్ స్తంభం కూలిపోయింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

హుకుంపేట: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

అరకులోయలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయ రూరల్: మండలంలో శుక్రవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కంఠభంసుగుడ, సరభగుడ హౌసింగ్ కాలనీ, రవ్వలగుడ, పద్మాపురం, చినలబుడు ప్రాంతాల్లో విద్యుత్‌లైన్లపై చెట్లు విరిగి పడ్డాయి. దీంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే వాటిని తొలగించి విద్యుత్ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు.

రోడ్లకు అడ్డంగా కూలిన చెట్లు

ఎటపాక: మండలంలో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో వర్షం కురిసింది. దీంతో ఎటపాక, గోళ్లగట్ట ప్రాంతాల్లో చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డాయి. ఎటపాకలో ప్రధాన రహదారిపై భారీ చెట్టు కూలడంతో భద్రాచలం,చర్ల రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలపై కూలడంతో సరఫరా నిలిచిపోయింది.

క్లుప్తంగా

డోలీలో గర్భిణి తరలింపు



గర్భిణిని డోలీమోతతో తరలిస్తున్న గిరిజనులు

అరకులోయ రూరల్: మండలంలో బస్కి పంచాయితీ కొత్రయిగుడలో పురిటినొప్పులతో బాధపడుతున్న సమర్థి డాలిమ్మను డోలీలో మోసుకుని మాడగడ పీహెచ్‌సీకి తరలించారు. రహదారి సౌకర్యం లేనందున గ్రామానికి అంబులెన్సు వచ్చే పరిస్థితి లేదని ఆమె బంధువులు వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు స్వాగతం



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున

గోపాలపట్నం: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎంపీ భరత్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మెగా జాబ్‌మేళాలో 160 మంది ఎంపిక



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. సుమారు 13 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 417 ఉద్యోగ ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 228 మంది అభ్యర్థులు హాజరైతే 160 మంది ఎంపికైనట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. జూనియర్ ఉపాధి అధికారి కుమారస్వామి, ఐటీఐ, అప్రెంటిస్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మా రూటే సెపరేటు..!

- 'ప్రైవేటు'లో సొంత పుస్తకాలు
- ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల కొనుగోలుకు నిరాశక్తత
- విద్యార్థులకు ఆర్థిక భారమవుతున్న ప్రైవేటు చదువులు
- స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలు
- ఫీజులు వసూళ్లపై నియంత్రణ కరువు
- ఉమ్మడి విశాఖలో 1,436 ప్రైవేటు స్కూళ్లు

విశాఖ విద్య: ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ద్వారా ముద్రించిన పాఠ్యపుస్తకాలనే వినియోగించాలనే నిబంధనలకు తూట్లు పడుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న ప్రైవేటు స్కూళ్లకు ఏటా ఎంపిక చేసిన ఏజెన్సీల ద్వారా పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తుంటారు. ఇందుకోసం పాఠశాల యు-డైస్ కోడ్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతుల వారీగా ఎంతమంది విద్యార్థులు ఉన్నారు..? వారికి కావాల్సిన పాఠ్యపుస్తకాల వివరాలను ఆయా ప్రైవేటు యాజమాన్యాలు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 1,436 ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ స్కూళ్లలో అడ్మిషన్లు ప్రక్రియ జోరందుకుంది. విద్యార్థులు అడ్మిషన్లు తీసుకునే సమయంలోనే ప్రైవేటు యజమాన్యాలు పుస్తకాలు, యూనిఫారాలు వంటి వాటిని తమ వద్దనే కొనాలనే ఒత్తిడి చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

సొంత పుస్తకాలు వీల్లేదు

ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లల్లో తప్పనిసరిగా ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్యపుస్తకాలతోనే బోధన సాగాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఎస్‌సీఈఆర్‌టీ తయారు చేసిన ప్రశ్నా పత్రాలతోనే పరీక్షలన్నీ నిర్వహించనున్నారు. అయితే కొన్ని కార్పొరేట్ స్కూళ్లల్లో ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్ కాకుండా, తమ సొంత సిలబస్‌తో పుస్తకాలను ముద్రించి, వాటిని విద్యార్థులతో కొనుగోలు చేయిస్తున్నారు. వీటి కోసమని ఎంతలేదన్నా రూ.10 వేలు వరకు చెల్లించాల్సి వస్తోందని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు.



ఓ ప్రైవేటు స్కూల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

స్కూళ్లలోనే పుస్తకాల వ్యాపారం:-

పాఠ్యపుస్తకాలను నిర్ణీత ధరలకే విక్రయించేలా గతేడాది విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. 1వ తరగతి రూ.399లు, రెండో తరగతి రూ.425లు, మూడో తరగతి రూ.675లు, నాల్గో తరగతి రూ.702లు, 5వ తరగతికి రూ.727లు, 6వ తరగతికి రూ.747లు, 7వ తరగతి రూ.871లు, 8వ తరగతి రూ.1,181లు, 9వ తరగతికి రూ.1,167లు, పదో తరగతికి రూ. 859లు గా నిర్ణయించారు. ఈ ఏడాది దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత లేకపోవటంతో ప్రైవేటు యాజమాన్యాలు స్కూళ్లలోనే పుస్తకాల వ్యాపారానికి తెరలేపారు.

అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు

ప్రైవేటు స్కూళ్లల్లో విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులపై విద్యాశాఖ నియంత్రణ లేకపోవటంతో పేద,మధ్య తరగతి వారికి తీవ్రమైన ఆర్థిక భారమవుతోంది. ప్రైవేటు స్కూల్ మోజుతో అడ్మిషన్లు కోసమని వస్తే యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ నగరంలో డిమాండ్ ఉన్న కొన్ని స్కూళ్లలో ఒకటో తరగతికి రూ.40 నుంచి 50 వేలు వరకు అదే పదో తరగతికి అయితే రూ.70 వేలు నుంచి రూ.1 లక్ష వరకు కూడా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకే ఫీజుల వసూలు చేయాలి. అది కూడా ఎంత వసూలు చేయాలనేది పాఠశాల ప్రాంగణాల్లోని బోర్డులపై అందరికీ కనిపించేలా రాయాలి. కానీ విశాఖ నగరంలోని పాఠశాలల్లో ఇవేమీ కనిపించటం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్ స్థాయిలో సత్వరమే స్పందించి, అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని వారు కోరుతున్నారు.

సొంత పుస్తకాలు విక్రయిస్తే చర్యలు



ప్రైవేటు స్కూళ్లలోనూ తప్పనిసరిగా ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే చదువులు సాగాలి. అలా కాకుండా ఎక్కడైనా సొంత పుస్తకాలు ముద్రించి విక్రయించినట్లుగా కానీ, వాటితో బోధన చేస్తున్నట్లు తెలిస్తే అలాంటి పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల వారంతా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాల కోసం వెంటనే నివేదికలు సమర్పించాలి. దీనిపై పర్యవేక్షణ చేసేలా డీఈవోలకు ఆదేశాలు ఇచ్చాం.

– బి. విజయ భాస్కర్, రీజినల్ జాయింట్ డైరక్టర్,

ప్రతి రోజూ జాతరే..

- బొజ్జన్నకొండకు సందర్శకుల తాకిడి
- చిన్నారుల సందడితో కళకళ
- టూరిస్టు స్పాట్‌గా తీర్చిదిద్దడంతో పెరిగిన ఆదరణ

తుమ్మపాల: చక్కని రహదారులు.. ఎటు చూసినా పచ్చదనం.. అధునాతన భవనాల నిర్మాణం.. పర్యాటక కేంద్రంగా ఎదిగిన బొజ్జన్నకొండ ఇప్పుడు సందర్శకులకు కనువిందు చేస్తోంది. బౌద్ధ స్థూపాలు, చైత్యాలు, గుహలు, బౌద్ధ వేదశాల, చరిత్రను ప్రతిబింబించే పురాతన శిలలు ఇక్కడి ప్రత్యేకత. దీంతోపాటు లింగాలకొండ బొజ్జన్నకొండను ఆనుకుని ఉండటం మరో విశేషం. గౌతమబుద్ధుడు ఇక్కడ నడయాడినట్లు చరిత్ర చెబుతుంది. ఒకప్పుడు మచ్చుకైనా గుర్తింపులేని బొజ్జన్నకొండ.. మాజీ ఎంపీ బి.వి.సత్యవతి ఎంపీ ల్యాడ్స్ నిధులు వెచ్చించి, రూ.7.5 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యేలా కృషి చేయడంతో కొత్త రూపు సంతరించుకుంటోంది. బొజ్జన్నకొండకు అత్యంత నాణ్యమైన రహదారి నిర్మించారు. అధునాతన సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించి అధునాతన భవనాలను నిర్మించేందుకు కృషి చేసింది. ఇప్పుడు శరవేగంగా భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పురాతన కట్టడాలు శిథిలమవ్వకుండా మరమ్మతులు చేపడుతున్నారు.

పెరిగిన పర్యాటకులు : గత ప్రభుత్వాలు ఈ బౌద్ధ క్షేత్రాన్ని నిర్లక్ష్యం చేశాయి. హైవే నుంచి ఇక్కడకు రావాలంటే పెద్ద గోతులతో ఉన్న రహదారిని దాటుకొని రావాలి. అందుకే పర్యాటకులు బెంబేలెత్తిపోయేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతం పూర్తిగా మారిపోయింది. బొజ్జన్నకొండను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అత్యధిక నిధులు వెచ్చించారు. దీంతో సాయంత్రం అయ్యేసరికి వందల సంఖ్యలో కొండ వద్దకు తరలివస్తున్నారు. వేసవి సెలవుల్లో చిన్నారులు బొజ్జన్నకొండ వద్దనే ఆటపాటలతో సందడి చేశారు. దీంతో ఇక్కడ చిరు వ్యాపారాలు కూడా జోరందుకున్నాయి. జిల్లా టూరిజం శాఖ మంచి నీరు, వాష్‌రూమ్ సౌకర్యం కల్పించింది. అనకాపల్లి-చోడవరం రహదారిలో తుమ్మపాల ఏలేరు కాలువ మీదుగా, అనకాపల్లి-సబ్బవరం రహదారి శంకరం ఏలేరు కాలువ మీదుగా కూడా సందర్శకులు రాకపోకలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పరిసర ప్రాంత ప్రజలు వాకింగ్, జాగింగ్, వ్యాయామం కోసం ఇక్కడకు వస్తున్నారు.



బొజ్జన్నకొండ పరిసరాల్లో ఆడుకుంటున్న చిన్నారులు

ప్రవేశం ఉచితం : అనేక సౌకర్యాలు, చక్కని గ్రీనరీతో తీర్చిదిద్దిన బొజ్జన్నకొండ సందర్శనకు ప్రవేశం ఉచితం. కేవలం ఆధార్ కార్డు చూపించి బొజ్జన్నకొండపైకి ప్రవేశించవచ్చు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశం కల్పిస్తున్నారు. వందల సంఖ్యలో పెద్దలు, చిన్నారులు వచ్చి ఆటపాటలతో సందడి చేస్తున్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయండి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



సమావేశంలో మాట్లాడుతున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన పనులను నిబంధనలు ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశించారు. పీవో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఏజెన్సీ ఏడు మండలాల్లో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనులు సరిగా చేయని అధికారులకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. పనులు జరిగే ప్రాంతాలకు వెళ్లి జరిగిన పనులు వీడియో, ఫొటోలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పీహెచ్‌సీలకు మంజూరైన బర్త్ వెయింటింగ్ హాలు నిర్మాణాలకు టెండర్లు పిలవాలని ఆదేశించారు. రోడ్లు, వంతెనలు నిర్మాణాలు ఏదశలో ఉన్నాయో తెలుసుకున్నారు. మారేడుమిల్లి మండలం ఇజ్జలూరు గ్రామం నేషనల్ పార్కు పరిధిలో ఉన్న గ్రామాలను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వై.రామవరం మండలంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌కు సంబంధించిన ఉద్యోగులు క్వార్టర్ల నిర్మాణ పనులను సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గంగవరం, అడ్డతీగల మండలాల్లో గోకులం పథకంలో నిర్మిస్తున్న పశువుల షెడ్ల నిర్మాణాలపై అధికారులతో చర్చించారు. ఈఈ జి.డేవిడ్‌రాజు, డీఈ చైతన్య, నాగరాజు, గౌతమి ఏఈలు సత్యనారాయణ, భాను, వీరభద్రరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి

సాక్షి, పాడేరు: జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లోను క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను వైద్యులంతా విజయవంతంగా నిర్వహించాలని పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి ఆదేశించారు. పీహెచ్‌సీల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి వైద్యులకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక రకాల క్యాన్సర్‌తో మరణాలు అధికంగా ఉన్నాయని, ప్రాథమిక దశలోనే రోగులు వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.అయితే వైద్యులంతా గ్రామాలలో క్యాన్సర్ అనుమానిత రోగులను గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. క్యాన్సర్‌గా నిర్ధారణ జరిగితే ఆయా రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైద్య నిపుణులంతా పలువురు వైద్యులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై శిక్షణ ఇచ్చారు.

దుకాణాల్లో నిల్వ ఆహార పదార్థాల తనిఖీ



దుకాణంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి గోపి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో సమోసా, చాట్ తదితర తినుబండారాల దుకాణాల్లో నిల్వ ఆహార పదార్థాల అమ్మకాలపై కొంతమంది కొనుగోలుదారులు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.దీంతో పంచాయతీ కార్యదర్శి గోపి ఆయా దుకాణాలను ఆకస్మికంగా సందర్శించి, సమోసాలు, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. ఇందులో భాగంగా పలుమార్లు వినియోగించిన నూనెను మరలా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. సమోసాలకు వినియోగించే బంగాళదుంప కూర నుంచి దుర్వాసన రావడాన్ని గమనించారు. దీంతో పాటు వాణిజ్యపరమైన సిలిండర్లకు బదులుగా గృహాల్లో ఉపయోగించే ఎల్‌పీజీ సిలిండర్లు వినియోగిస్తున్నట్టు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఆహార పదార్థాలు అమ్మకాలు చేస్తున్న (హర్యానా, రాజస్థాన్‌కు చెందిన వ్యాపారుల) దుకాణాలను మూయించారు. దీనిపై ఫుడ్ శాఖకు చెందిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి గోపి చెప్పారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



మహిళకు హైజనిక్ కిట్‌ను అందజేస్తున్న ఐటీడీఏ పీవో చైతన్య

కూనవరం: మహిళలు నెలసరి సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలోని భగవానపురంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ ప్యాడ్స్ వినియోగం వలన అధిక ఖర్చు అవుతుండడంతో సెర్ప్ ఆధ్వర్యంలో భగవానపురంకు చెందిన మహిళలకు ఇటీవల మెనుస్ట్రువల్ కప్ వినియోగంపై అవగాహన కల్పించారు. వీటి వినియోగానికి మహిళలు అంగీకారం తెలపడంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్ శ్వేత ద్వారా అవగాహన కల్పించి వాటిని మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పీవో కావూరి చైతన్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో రాష్ట్రంలోనే తొలిసారిగా గిరిజన గ్రామంలో మెనుస్ట్రువల్ కప్ అమలు చేయడం శుభపరిణామమని తెలిపారు. నాలుగు మండలాల్లోని అన్ని గ్రామాల్లో కూడా వీటిని అమలు చేసేందుకు నిధులు అందచేస్తామని ఆయన తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ, ఎంపీపీ పాయం రంగమ్మ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏపీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

19 నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

మహారాణిపేట: జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ నెల 19 నుంచి ఆరిలోవలోని అపోలో ఆస్పత్రిలో జర్నలిస్టులతో పాటు వారి జీవిత భాగస్వామికి కూడా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24లో అక్రిడిటేషన్ కలిగిన జిల్లాలోని జర్నలిస్టులందరి వివరాలను అపోలో యాజమాన్యానికి పంపించినట్లు తెలిపారు. సంబంధిత జాబితాను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు 19వ తేదీ నుంచి ఉదయం 8 నుంచి 9.30 గంటల మధ్యలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షల అనంతరం రిపోర్టులు వచ్చాక వైద్యుడిని సంప్రదించి చెకప్ కూడా చేయించుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు 50 మందికి చొప్పున వైద్య పరీక్షలు జరుగుతాయని, జిల్లాలోని జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 17వ తేదీలోగా వైద్య పరీక్షలు చేసుకునే అక్రిడిటేషన్ జర్నలిస్టులు, వారి జీవిత భాగస్వామి ప్రాథమిక వివరాలను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం/ పీఆర్వో కిశోర్‌కు 80086 56504లో తెలియజేయాలన్నారు.

28న 100వ తపాలా డాక్ అదాలత్

ఎంవీపీ కాలనీ: తపాలా వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 28న ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ రీజనల్ కార్యాలయంలో 100వ తపాలా డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఆర్ఎంఎస్-వీ డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్న రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 100వ డాక్/ పెన్షన్స్ అదాలత్‌గా దీన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అల్లూరి, పార్వతీపురం, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు తమ సమస్యలను ఈ నెల 21వ తేదీలోపు ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు. అనంతరం 28వ తేదీ జరిగే డాక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

శాస్త్ర విద్య సమాజ అభివృద్ధికి ఆధారం

ఆర్జేడీ విజయభాస్కర్



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

సింహాచలం: శాస్త్ర విద్య అనేది సమాజ అభివృద్ధికి ఆధారమైనది.. జీవశాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు శాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకుంటూ నాణ్యమైన బోధనను అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో విశాఖ జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నైపుణ్యాల పెంపుపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 250 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ శాస్త్ర విద్య ఎంత నేర్చుకున్నా తరగనిదన్నారు. కొత్తగా ఆలోచించాలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసం ఓరియంటేషన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, రిసోర్సు పర్సన్స్ ఎస్.బాబూరావు, జి.చంద్రమౌళి, సీహెచ్.రాధాకృష్ణ, పి.రవిప్రసాద్, ఎం.వి.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాంతపు పూజలు

కొమ్మాది (విశాఖ): రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు.

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లు స్వాధీనం

రంపచోడవరం: అక్రమంగా తాబేళ్లను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోక్సుపేట రేంజ్ పరిధిలోని పోక్సుపేట అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లు పట్టుబడ్డాయి. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అటవీ అధికారులు శనివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడిస్తామన్నారు. అయితే ఇటీవల రామచంద్రపురం నుంచి ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న 1300 తాబేళ్లను అటవీ అధికారులు పట్టుకున్నారు. ప్రస్తుతం అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న తాబేళ్లు కూడా అదే ప్రాంతం నుంచి అక్రమంగా ఒడిశాకు తరలిస్తున్నట్టు సమాచారం.

కనకమ్మకు క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్ (విశాఖ) : నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడుకనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి.

శ్రావ్యంగా కచేరీ

మద్దిలపాలెం (విశాఖ) : విశాఖ మ్యూజిక్ అకాడమి యువజన వార్షికోత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కోటా గాయత్రి వరేణ్య, మాస్టర్ సాయికేశవ్ సబేశన్‌ల బృందం నిర్వహించిన వయోలిన్ కచేరీ శ్రావ్యంగా సాగింది. అనంతరం గాత్ర కచేరీలో ఘట్టి శ్రీవిద్య భక్తి గీతాలు ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమాన్ని వీఎంఏ కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్, కృష్ణారావు, అయ్యంగారి భుజంగరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రెండు రోజుల పాటు సంగీత యువజనోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలపై సమీక్ష



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ఉన్నత విద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామల రావు ఆన్‌లైన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సీడీసీ డీన్ ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణ రెడ్డిలు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల్లో ప్రవేశాల ప్రక్రియ, కళాశాలల తనిఖీలు, వసతులు పరిశీలన, అనుమతులు, ఎఫిలియేషన్ల జారీ తదితర అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయాల అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. రెండు వారాల్లోగా వీటిని పూర్తిచేయాలని తెలిపారు.